క్లుప్తంగా

సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: గ్రామాల్లో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎంఎల్‌సీసీ కార్యక్రమంలో భాగంగా అర్జీదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలకు తావులేకుండా స్థానికంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. భూ వివాదాలు అధికారుల సమక్షంలో పరిష్కారమయ్యేలా చూసుకోవాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఏఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాలేదు'

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాలేదని తహసీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు.శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు.తోటాడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 407/6లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందంటూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుమేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి విచారణ చేయించామన్నారు. సర్వే నంబరులో స్థలాన్ని యజమాని ఎక్కడా ప్రభుత్వ స్థలం కలుపుకొని లే-అవుట్ వేయలేదని నిర్ధారించామన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి కూడా సర్వే నంబరు 402లో మాత్రమే ఉందన్నారు.

'అన్నదాత సుఖీభవ' పంపిణీ

నక్కపల్లి: జిల్లాలో అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ఆర్థిక సాయం మంజూరైనట్టు టీడీపీ జిల్లాఅధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్‌కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. డొంకాడలో శనివారం జరిగిన పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొత్తం 39,323 మంది రైతులకు రూ.26.19 కోట్లు విడుదలైనట్టు చెప్పారు. ఈమొత్తానికి సంబంధించిన చెక్కును వ్యవసాయ శాఖ సిబ్బందికి అందజేశారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ మానస

మునగపాక: మూలపేట శివారు గంగాదేవిపేటలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస తెలిపారు. గ్రామంలో జరుగుతున్న పైప్‌లైన్ కాంక్రీట్ పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగాదేవిపేటలో రూ.40లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

అచ్యుతాపురం రూరల్ : మార్టూరులో రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యమైన జీవనం సాగించడానికి పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, తడి చెత్త పొడి చెత్త సేకరించడంలో పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు.

ఏఎస్‌ఐ త్రినాథరావుకు ఎస్‌ఐగా పదోన్నతి

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న సీహెచ్.త్రినాథరావుకు ఎస్ఐగా పదోన్నతి లభించింది. మునగపాక పీఎస్‌లో ఇటీవల ఏఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన త్రినాథరావుకు ఎస్‌ఐగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.త్వరలో ఆయనకు విధులు ఎక్కడ నిర్వహించాలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రానున్నాయి.

ఘనంగా మహాపల్లకీ మహోత్సవం



తిమ్మరాజుపేట సత్యసాయి బాబా ఆలయంలో పల్లకీ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం రాత్రి మహాపల్లకీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల్లో భాగంగా అనకాపల్లి గాంధీనగరం వారిచే తిమ్మరాజుపేట సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. సాయినామ స్మరణతో తిమ్మరాజుపేట మార్మోగింది.సత్యసాయి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు,జిల్లా అధ్యక్షులు కె.అప్పలనాయుడుతో పాటు జిల్లా పదాధికారులు, పలువురు సత్యసాయి భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివారు గ్రామాలపై చిన్నచూపు

- అభివృద్ధికి ఆమడదూరంలో పల్లెలు
- అధ్వానంగా రహదారులు
- అసంపూర్తిగా భవనాలు



శిథిలావస్థకు చేరుకున్న గంగాదేవిపేట రోడ్డు

మునగపాక: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. తాము అధికారంలోకి వస్తే గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ హామీలు గుప్పించిన నాయకులు అధికారం చేపట్టి ఏడాది పూర్తియినా ఆ ఊసే ఎత్తడం లేదు. శివారు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వ్యాధులు ప్రబలుతాయేమోని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

డ్రైనేజీలకు నోచుకోని మంగళవరపుపేట

మండలంలోని పాటిపల్లి శివారు మంగళవరపుపేటలో డ్రైనేజీలు లేవు. దీంతో వాడుక నీరంతా రహదారులపైకి వచ్చేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు.



డ్రైనేజీలు లేని మంగళవరపుపేట

శిథిలావస్థకు చేరిన గంగాదేవిపేట రోడ్డు

మండలంలోని మూలపేట శివారు గంగాదేవిపేట ప్రధాన రోడ్డు శిథిలావస్థకు చేరింది. రహదారిపై పలు చోట్ల బీటలు వారి, అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. పూడిమడక రోడ్డులోని గంగాదేవిపేట జంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఒకటే మార్గం ఉంది.



పురుషోత్తపురంలో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనం

అసంపూర్తిగా సామాజిక భవనం

మండలంలోని గంటవానిపాలెం శివారు పురుషోత్తపురాన్ని సమస్యలు వేధిస్తున్నాయి. గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సామాజిక భవనం నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తోంది. గ్రామంలో శుభ కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా కల్యాణమండపం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. నిధులు చాలకపోవడంతో నేటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో అసంపూర్తిగా దర్శనమిస్తోంది. దీనికి తోడు గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా యాదగిరిపాలెం రోడ్డు

మండలంలోని మెలిపాక శివారు యాదగిరిపాలెం రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. పక్కారోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. గోతుల్లో వాహనాలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతులు లేని రహదారుల నిర్మాణాలే లక్ష్యమంటూ ఊకదంపుడు ప్రసంగాలు చేసిన నాయకులకు స్థానికులు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదు.

> **గ్రామాల అభివృద్ధికి చర్యలు**
>
> శివారు గ్రామాల అభివృద్ధికి అవసరమయ్యే చర్యలు తీసుకుంటాం.శివారు గ్రామాల్లో సమస్యలను గుర్తించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.
>
> – ఎం.సోమరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో



అధ్వానంగా దర్శనమిస్తున్న యాదగిరిపాలెం రోడ్డు(ఫైల్)

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్ష చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

కోటవురట్ల: కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. సీఫా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విశాఖ ఐ కేర్ ట్రస్ట్ సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ ఐ కేర్ ట్రస్ట్ సిబ్బంది ఆధునిక పరికరాలతో విద్యార్థులకు పరీక్షలు చేశారని తెలిపారు. అవసరమైన వారికి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం పాటు, కళ్లద్దాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కృపామణి, శ్రీనివాసరావు, లోవరాజు, పరిమళ, సర్వలక్ష్మి, దీపిక, స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎస్.రాయవరం : అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.రమేష్‌బాబు హెచ్చరించారు. పెదగుమ్ములూరులోని డీ పట్టాభూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సీపీఎం నాయకులు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై ఎవరైనా మట్టి, గ్రావెల్‌ను అక్రమంగా తవ్వినా, తరలించినా చర్యలు తప్పవన్నారు.

నదిలో తూరలు మాయం

కోటవురట్ల: జల్లూరు వరాహనదిలో డైవర్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన తూరలు మాయమయ్యాయి. పాత వంతెన శిథిలం కావడంతో గతంలో సుమారు రూ.40 లక్షలతో నదిలో డైవర్షన్ రోడ్డు వేశారు. కొత్త వంతెన నిర్మించడంతో డైవర్షన్ రోడ్డు అవసరం లేకుండా పోయింది. దీంతో పలువురి కన్ను నదిలో ఏర్పాటు చేసిన తూరలపై పడింది. ఈ క్రమంలో నదిలో నుంచి 12 తూరలను పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఒడ్డుకు చేర్చారు. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖాధికారులను అప్రమత్తం చేస్తూ తూరలకు కాళ్లొచ్చాయంటూ 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడింది. అయినా ఆ శాఖాధికారులు పట్టించుకోలేదు. తూరలను బయటకు తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవలసిన అధికారులు మిన్నకుండిపోయారు. ప్రస్తుతం ఆ తూరల్లో కొన్ని అక్కడి నుంచి మాయమయ్యాయి. కాగా నదిని ఆనుకుని వంతెన పక్క నుంచి ఓ టీడీపీ నేత గ్రావెల్ రోడ్డు వేశారు. రెండు రోజుల క్రితం ఆ రోడ్డుకు గండి కొట్టి పక్కనున్న రైతుల పొలాల్లోని నీరు నిలవ లేకుండా తూరలు ఏర్పాటు చేశారు. అయితే నదిలోని మాయమైన తూరలతోనే ఇక్కడ నిర్మాణం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖాధికారుల సహాయ సహకారాలతోనే ఆ తూరలు మాయమైనట్టుగా విమర్శలు వస్తున్నాయి. గతంలో హెచ్చరికలు చేస్తూ కథనం రాసినప్పటికీ పట్టించుకోకుండా మిన్నకుండిపోవడంతో ఇందులో ఆ శాఖాధికారుల హస్తం ఉన్నట్టు అనుమానం కలుగుతోంది. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా తూరలు పట్టుకెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వరాహనదిలో గతంలో ఏర్పాటు చేసిన తూరలు

తల్లి పాలతో రోగ నిరోధకశక్తి వృద్ధి



అరబుపాలెంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవ ర్యాలీ



తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తున్న వైద్యాధికారి షకినా జాయ్



శ్రీరాంపురంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక: తల్లిపాల ద్వారా పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ, మానవ హారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమన్నారు. ఏఎన్‌ఎం రమణి మాట్లాడుతూ తల్లిపాలలో పోషక విలువలు ఉంటాయని, అలాగే బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చేంతవరకు తల్లిపాలు అందించాలన్నారు. ఉప సర్పంచ్ దొడ్డి కృష్ణ,పంచాయతీ కార్యదర్శి హరినాథ్,వీఆర్వో సింహాచలం,గంగాధర్,అంగన్‌వాడీ సిబ్బంది యమున,ప్రమీల,అచ్చియ్యమ్మ,రమ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: తల్లిపాలు శిశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షకినా జాయ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాలు సులువుగా జీర్ణమవుతాయని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకటప్పారావు మాట్లాడుతూ తల్లిపాలు శిశువులకు ఇవ్వడంలో ఎటువంటి అపోహలు ఉండకూడదని చెప్పారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఏసీడీపీవో ఇందిరా దేవి, సూపర్‌వైజర్ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఏఎన్‌ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, వెంకటలక్ష్మి, ఆశా వర్కర్లు పార్వతి, గీతా, మహిళా పోలీస్ బేగం పాల్గొన్నారు.

పాయకరావుపేట: శ్రీరాంపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శనివారం తల్లిపాలవారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

జగనన్న హయాంలో సంక్షేమం..
చంద్రబాబు పాలనలో సంక్షోభం

- యలమంచిలి మండలంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ ప్రారంభం
- 'కూటమి' మోసాలపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ధర్మశ్రీ ధ్వజం
- కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన



పీఎన్‌ఆర్ పేటలో పార్టీ నాయకులకు క్యూఆర్ కోడ్ చూపుతున్న కరణం ధర్మశ్రీ



ఏటికొప్పాకలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ కష్టమూ పడలేదు..పేదలకు ఆర్థిక భరోసా ఇచ్చి గత సీఎం జగన్ అండగా నిలిచారు, మళ్లీ జగన్ పాలన రావాలి' అంటూ పలు గ్రామాల ప్రజలు తమ ఆకాంక్షను బయటపెట్టారు.యలమంచిలి మండలం ఏటికొప్పాక,పద్మనాభరాజుపేట,బయ్యవరం,ములకలాపల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ,మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని,ప్రజలంతా కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని ధర్మశ్రీ ఈ సందర్భంగా కోరారు. ఏటికొప్పాకలో బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఆయన ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గత 14 నెలల కాలంలో ప్రజలు ఎంత నష్టపోయిందీ వివరించారు. దీంతో పలువురు గ్రామస్థులు స్పందిస్తూ వైఎస్ జగన్ పాలనతో ప్రస్తుత కూటమి పాలనను బేరీజు వేసుకుని జగన్ పాలన ప్రయోజనాలను గుర్తు తెచ్చుకున్నారు. కరోనా కష్టకాలంలోనూ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ప్రజలు ధర్మశ్రీ,పార్టీ నాయకుల ఎదుట చెప్పారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు క్యూఆర్ కోడ్‌తో ప్రజల అభిప్రాయాలుతెలుసుకోవాలని సూచించారు.

కూటమిది తొలి అడుగు కాదు..ఇదే చివరి అడుగు

రాష్ట్రానికి ఏదో మంచి చేశామని కూటమి నాయకులు సుపరిపాలన..తొలి అడుగు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారని,వారికి తొలి అడుగు కాదని..ఇదే చివరి అడుగని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్నా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు.సంక్షేమం అందరికీ సాధ్యం కాదని,అది కేవలం వైఎస్ కుటుంబానికే సాధ్యమన్నారు.సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదని ఆయన ఆరోపించారు.ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి,ఉచిత బస్సు ఇలా ఒకటి కాదు..రెండు కాదు 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్కటీ సక్రమంగా అమలు చేయకుండా ప్రజలకు శఠగోపం పెట్టారన్నారు.ఏటికొప్పాక, పద్మనాభరాజుపేట,బయ్యవరం,ములకలాపల్లి గ్రామాల్లో పార్టీ కమిటీలను నియమించాలనిసూచించారు.ప్రతి గ్రామంలో 10 మందితో పార్టీ, ఐదు గురితో మహిళ, ఐదు గురితో రైతు,మరో ఐదు గురితో యువజన కమిటీలను నియమించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్,జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి,యలమంచిలి పట్టణ, మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర,కొల్లి త్రినాథ్, ఏటికొప్పాక సీనియర్ నాయకుడు రాజాబాబు, సేనాపతి రాము,జిల్లా బీసీ సెల్ ఉద్దండం త్రినాథరావు(యూటీఆర్),మైలార్ వెంకటరమణ(శ్రీను),గొన్నాబత్తుల శివ,పద్మనాభరాజుపేట ఎంపీటీసీ రాజీవ్,యడ్ల వాసు,బయ్యవరం సర్పంచ్ మొగలవల్లి సత్యనారాయణ(పండు), సిద్దా నూకేశ్వరరావు,ములకలాపల్లి, రుక్మిణీపురం సర్పంచ్‌లు దుబాసి అప్పలనాయుడు,కరణం పండు,మాజీ సర్పంచులు ఆడపా అప్పలనాయుడు,కృష్ణ,మర్రి రాజు,కాళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ములకలాపల్లిలో ప్రసంగాలను వింటున్న వృద్ధులు

రేపు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

ఎస్.రాయవరం: మండలంలో ఎస్.రాయవరం, పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో పలుగ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు.విద్యుత్‌లైన్లపై గల చెట్టుకొమ్మల తొలగింపు, చిన్న చిన్న మరమ్మతుల పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉప్పరాపల్లి,వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం,సర్వసిద్ధి,కర్రివాపాలెం,బసవపాడు,సైతారుపేట,వాకపాడు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్ పరిధిలో పెట్టుగోళ్లపల్లి,రామయ్యపట్నం,చెల్లాపురం,పెదబోదిగళ్లం,సీతమ్మపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

నాణ్యమైన బోధనకు కృషి

డీఐఈవో వినోద్‌బాబు

యలమంచిలి రూరల్: మారిన మొదటి సంవత్సరం సిలబస్‌కు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరగాలన్న సంకల్పంతో ఇంటర్మీడియెట్ విద్యా మండలి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి మద్దిలి వినోద్‌బాబు తెలిపారు.దీనిలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు దశల వారీగా ఆయా సబ్జెక్టులపై ఓరియంటేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మ్యాథ్స్ లెక్చరర్ల ఓరియంటేషన్ క్లాసులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ తరగతులను సద్వినియోగపర్చుకుని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా బోధన చేయాలని ఆయన అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్, జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న మ్యాథ్స్ లెక్చరర్లు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ క్లాసులను పరిశీలిస్తున్న డీఐఈవో వినోద్‌బాబు

మట్టిని మింగేస్తున్నారు

- చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- అక్రమంగా తరలింపు



ఈదటం చెరువులో గ్రావెల్‌ను తవ్విన ప్రాంతం



ఈదటం గ్రామ పరిధిలో సాగు నీటి చెరువులో మట్టిని తవ్విన ప్రాంతం



గ్రావెల్, మట్టి తరలింపు కోసం తవ్వేసిన చెరువు గట్టు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరిపి మట్టి,గ్రావెల్‌ను అక్రమంగా తరలించేస్తున్నారు. శ్రీరాంపురం వద్ద ఉన్న పాయకరాని చెరువు, గోపాలపట్నం వద్ద ఉన్న ఆవ గర్భం, కందిపూడి, ఈదటం గ్రామాల పరిధిలో గల సాగునీటి చెరువుల్లో రాత్రి సమయంలో పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వి, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారని ఆయా గ్రామస్తులు తెలిపారు. ఈదటం గ్రామ పరిధిలో గల పట్టా భూముల్లో పుంతలను అక్రమంగా తవ్వి మట్టిని తరలించేస్తున్నారు. ట్రాక్టరు మట్టిని రూ.700 వరకూ విక్రయిస్తున్నారు. చెరువుల్లో గ్రావెల్, మట్టిని తవ్వడం వల్ల లోతు పెరిగిపోయి సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని తరలించడం కోసం చెరువు గట్లను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి మండలంలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలను నిరోధించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ జేఈ వినయ్‌ను సంప్రదించగా మండలంలోని సాగునీటి చెరువులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. చెరువుల నుంచి అక్రమంగా గ్రావెల్, మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.